మోదకొండమ్మ జాతరను జయప్రదం చేయండి : పిఒ

ప్రజాశక్తి-పాడేరు, పాడేరుటౌన్: అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మోద కొండమ్మ అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. మోదకొండమ్మ జాతర నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు, ఆహార పొట్లాల పంపిణీ, కార్నివాల్ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయాలు, ఆహార పొట్లాలు పంపిణీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అబివృద్ధి కార్యక్రమాలపై ప్రదర్శన స్టాళ్లను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతరలో నిరంతరం పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒలు వివిఎస్ ప్రభాకరరావు, ఎం.వేంకటేశ్వరరావు, టిడబ్ల్యూ ఇఇ డివిఆర్ఎం రాజు, ఆర్అండ్ బి శాఖ ఇఇ బాలసుందరబాబు, డిఎంఅండ్ హెచ్ఒ జమాల్ భాషా, ఐటిడిఎ పరిపాలనాధికారి హేమలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ లీలా క్రిష్ణ, డిఇ ప్రకాష్ పాల్గొన్నారు..

ఎమ్మెల్యే ఫాల్గుణకు నిరసన సెగ

- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన
- ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ గిరిజన సంఘం నేతల నినాదాలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: జగనన్న నువ్వే మా నమ్మకం, గడపగడపక కార్యక్రమంకు శనివారం బస్కి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మహిళలు, గిరిజన సఘం నాయకులు ఖాళీ బిందెలతో నిరసనతో స్వాగతం పలికారు. గ్రామంలో మంచినీటి సమస్యలు పరిష్కరించాలని, ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బస్కి గ్రామంలో ఎక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేశారో చూపించాలని మహిళలు నిలదీశారు. బస్కి పంచాయితి కేంద్రంలోని మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే పరిష్కరించాలని మండిపడ్డారు. బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఓట్ల రాజకీయం కోసం ఆదివాసి గిరిజనులను ద్రోహం చేస్తే సహించేది లేదన్నారు. బస్కి గ్రామంలో మంచినీరు, సిసి రోడ్డు, డ్రైనేజీ, అరకువేలి నుండి బస్కి పంచాయితీ వరకు తారు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, బస్కి సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రంగనీగుడ, కొంత్రాయిగూడలో మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే, అధికారులు వైసిపి నాయకులు పోలీసుల సహాయంతో గ్రామం నుంచి వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్.కృతష్ణమూర్తి, పొత్తి, ఎస్.మధు, కె ప్రహ్లాద్, ఎస్.చంటి, వీరూతమ్మ, ఇంద్ర, సావిత్రి పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

గిరిజనులకు వివిధ సామగ్రి అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

- అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి- పెదబయలు

కొండ్రు గ్రామంలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో మండలంలోని ఇంజరి పంచాయతీ పరిధి కొండ్రు గ్రామంలో 92 మంది మహిళలకు ప్యాడ్స్, వాషింగ్ సోప్స్, టూత్ బ్రష్, టూత్ పేస్ట్, నైటీలు, మాస్కులు, 65 మంది పురుషులకు లుంగీలు, సబ్బులు, మాస్కులు శనివారం పంపిణీ చేశారు. ఇందులో పాల్గొన్న అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మంచినీరు, ఆధార్ కార్డులు, స్కూల్ బిల్డింగ్, అంగన్వాడీ బిల్డింగ్ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి జయలక్ష్మి మాట్లాడుతూ కొండ్రు లాంటి అతి మారుమూల గ్రామంలో ఈ సామగ్రి పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని, మరిన్ని కార్యక్రమాలు గిరిజన గ్రామాల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ గతంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారితో కలిసి ఈ గ్రామాన్ని సందర్శించడం జరిగిందని, ఆ సమయంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన కొన్ని సమస్యలను పరిష్కరించామని, కొన్ని సమస్యలు విడతల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. సంబంధిత గుత్తేదారులతో మాట్లాడి త్వరలో గ్రావిటీ పథకాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజరి గ్రామ సర్పంచ్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సూర్య, లోహితాస్, మండల ఇంజనీరింగ్ అధికారి ఎస్ సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి గోపాల్, విఆర్ఓ సచివాలయం సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

1/70 చట్టం ప్రకారం

ఏజెన్సీలోనే భూ రిజిస్ట్రేషన్ కొనసాగించాలి

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీ ప్రాంతంలోనే భూ రిజిస్ట్రేషన్ కొనసాగించాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఐ.టి.డి. ఏ కార్యాలయంలో జిల్లా నాయకులు ఎల్.సుందరరావు, దాస్‌తో కలిసి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. రెవెన్యూ శాఖ - 5వ షెడ్యూల్డ్ ఏరియా(పాడేరు, రంపచోడవరం డివిజన్) పరిధిలో భూ రిజిస్ట్రేషన్ ఏజెన్సీ ప్రాంతంలోనే కొనసాగించాలని కోరుతూ ఇచ్చిన వినతి పత్రం అందజేశారు.ఐటిడిఏ ప్రాంతమైన పాడేరు, రంపచోడవరం, చింతూరు, పార్వతీపురం, సీతంపేట పరిధిలోని వివిధ గిరిజన తెగల 5వ షెడ్యూల్డ్ ఏరియా పాడేరు, రంపచోడవరం రెవిన్యూ డివిజన్ పరిధిలోని భూములకు మార్కెట్ విలువ వుందని ప్రభుత్వానికి తగినంత ఆదాయం సమకూర్చలేదని నాన్ షెడ్యూల్డ్ ఏరియా అనకాపల్లి జిల్లాలో వి.మాడుగుల, రాజమండ్రి జిల్లాలో వున్న గోకవరంలో 5వ షెడ్యూల్డ్ ఏరియాలో వున్న భూములను రిజిస్ట్రేషన్ చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు 156, 158ను 5వ షెడ్యూల్డ్ ఏరియా పరిపాలన, నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. పాడేరు, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలు ఆర్టికల్ 244 క్లాజ్ -1 ప్రకారం పరిపాలన, నియంత్రణ, గిరిజనుల రక్షణకు 5వ షెడ్యూల్డ్‌లో స్పష్టంగా పేర్కొనట్లు పార్ట్ -ఎ లో పొందుపరిచి నట్లు వివరించారు. 5వ షెడ్యూల్డ్ పార్ట్ - బి క్లాజ్ 4 ప్రకారం

ఐటిడిఎ పిఒకు గిరిజన సంఘం వినతి

గిరిజన సలహా మండలి (టిఎసి) ఆమోదం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ 15, 158 రాజ్యాంగ విరుద్ధమైందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియా భూ బదాలాయింపు, నియంత్రణ చట్టం 1970 ను 5వ షెడ్యూల్డ్ ఏరియా ప్రాంత గిరిజనుల రక్షణకు భారత రాజ్యాంగం ఆదేశాలను అనుసరించి నాడు రాష్ట్ర ప్రభుత్వం 1/70 చట్టం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 5వ షెడ్యూల్డ్ ఏరియాలో స్థానిక గిరిజనుల మధ్య మాత్రమే భూ క్రయ విక్రయాలు అధికారం పొందియుందన్నారు.తాజాగా ప్రభుత్వం జారీచేసిన భూ రిజిస్ట్రేషన్ జి.ఓ నెం.156, 158 గిరిజనుల మనోభావాలను అగౌరవ పరిచే విధంగా నూతన జిల్లా పరిపాలన కేంద్రమైన పాడేరును ఉద్దేశ్యపూర్వకంగా, వివక్షత పూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందనే భావన గిరిజన ప్రజల్లో కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గిరిజన జిల్లా ఉద్దేశ్యం, గిరిజనుల ప్రయోజనాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గిరిజన పాడేరు జిల్లా పరిపాలన వ్యవహారాలను ఇతర జిల్లాలో నిర్వహించుకోవలసినంత పరిస్థితి ఏజెన్సీ ప్రాంతంలో లేనందున తాజాగా ప్రభుత్వం జారీ చేసిన భూ రిజిస్ట్రేషన్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

నినాదాలు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

'ఉపాధి' కల్పించాలి

- గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-హుకుంపేట: ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, భూర్జా పంచాయితీ సులిపకోన్, సొంటర్ల పాడు, కొండయ్‌పాడు గ్రామాలకు ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికి సులిపకోన్, సొంటర్ల పాడు, కొండయ్య పాడు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించక పోవడం దారుణమన్నారు. కూలీ పనులు లేక పోవడంతో మైదాన ప్రాంతాలకు వలస వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజులో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ హామీ పనుల కల్పనలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి, శాఖ పరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పనులను తక్షణమే కల్పించక పోతే ఉపాధి హామీ కూలీలతో భారీ ఎత్తున మండల ఉపాధి ఏపీఓ కార్యాలయం ముట్టడిస్తామని అయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపిపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్‌రావు, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కిల్లో రామారావు, ఉపాధి హామీ కూలీలు మజ్జి చంద్రన్న, చిట్టిబాబు, తులసి బాబు, చంటి, నన్నారావు, బాలన్న, రమేష్, నాగేష్, పండన్న తదితరులు పాల్గొన్నారు.

21న ఆదివాసీ సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈనెల 21న జరగనున్న అఖిలభారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన శనివారం మారేడుమిల్లి సంతలో ప్రచారం నిర్వహించారు. ఆదివాసీలు, వారి హక్కులు, పర్యావరణ జీవావరణాల పరిరక్షణకై జరుగుతున్న సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కరపత్రాల పంచారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పండేల సోమన్న మాట్లాడుతూ గిరిజనుల మనుగడకు ముప్పు సంభవిస్తుందని, దీనికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాటం చేయడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు గెద్దాడ సూరిబాబు, బిర్ల సురేష్, కె.బాబురావు, కర్ణాకుల రామలింగేశ్వరరావు, పాలెపు రామారావు దొర తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పాడేరు: చింతపల్లి మండల కేంద్రంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ సమక్షంలో గిరిజన సంఘం మండల మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు.ఏజెన్సీలో ప్రధాన సమస్యలు, హైడ్రో పవర్ ప్రాజెక్ట్, బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, జీవో 3 పునరుద్ధరణ, గిరిజన గ్రామాలు తదితర సమస్యలపై భవిష్యత్తులో ఉదృతంగా పోరాటాలు నిర్వహించాలని నూతన కమిటీ తీర్మానం చేసింది. ఈ అంశాలను మహాసభలో చర్చించిన అనంతరం నూతన కమిటీ ఎన్నిక 20 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు మండల అధ్యక్షుడిగా బేరా రామకృష్ణ పడాల్, కార్యదర్శిగా సాగిన చిరంజీవిని మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శి మజ్జి రాంబాబు, కిల్లో సింహాచలం, గూడెపు రాజు, గూడెపు చినరాజు పడాల్, కొర్ర డేవిడ్, పాంగి సాము బాబులు ఎన్నిక కాగా మిగతా వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి-పెదబయలు : గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఉమ్మడి జిల్లాల జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. ముంచింగి పుట్టుకు వెళ్లి తిరిగి వస్తుండగా మండల కేంద్రంలో మోదకొండమ్మ దేవాలయాన్ని శనివారం ఆమె దర్శించుకొన్నారు. అనంతరం స్థానిక విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మాట్లాడుతూ, స్థానికంగా ఉన్న సమస్యలను గిరిజనులు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. స్థానిక గెస్ట్ హౌస్ మరమ్మతుకు ఎస్టిమేషన్ వేసి నివేదిక పంపిస్తే నిధులు మంజూరు చేస్తానన్నారు. వైసిపి నాయకుడు గంపరాయి సూరయ్య మాట్లాడుతూ, వర్షం పడితే మార్కెట్ షెడ్డులో సంత బురదమయం అవుతుందని, రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఎంపీపీ వరహాలమ్మ, వైస్ ఎంపీపీ కొర్ర రాజు మాట్లాడుతూ, అభివృద్ధి పనులకు సంబంధించి 8 నెలలుగా బిల్లులు మంజూరు కాలేదని, ప్రజాప్రతినిధులకు తెలపకుండా సంబంధిత అధికారులు కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నారని పిర్యాదు చేశారు. బిల్లులు ఎందుకు మంజూరు కాలేదని ఎంపీడీఓ పూర్ణయ్యతో పోన్‌లో మాట్లాడారు.

ఫోన్‌లో ఎంపిడిఒతో మాట్లాడుతున్న సుభద్ర

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు..మండలంలోని పటిమామిడి గ్రామంలో ముల్యపుట్టు పంచాయతీకి చెందిన కిల్లో ప్రవీణ్(26) శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన వివాహ శుభకార్యానికి టెన్ట్ సామగ్రిని బిగించేందుకు కుర్రాళ్ళతో కలిపి వెళ్లాడు. ఐరన్ పోల్స్ బిగిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కి గురైన కిల్లో ప్రవీణ్ మృతి చెందాడు. టెంటు సామగ్రి ఓనర్ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సై సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆటలు ఆడతున్న చిన్నారులు

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని గ్రంధాలయంలో చిన్నారుల సమ్మర్ క్యాంప్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా శనివారం చిన్నారులకు ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారిని సునీత మాట్లాడుతూ చిన్నారులకు అటల పోటీలు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది చిన్నారులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధంకండి

పోలవరం నిర్వాసితులకు సిపిఎం నేత బొప్పెన కిరణ్ పిలుపు

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్ట్ కోసం తమ భూములు, గ్రామాలు, జీవితాలను త్యాగం చేసిన నిర్వాసితులు తమకు జరుగుతున్న అన్యాయంపై పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. మండలంలోని బొజ్జరాయిగూడెంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ళ తరబడి సర్వేలు చేస్తూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఇస్తేనే ప్యాకేజీ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ ప్రజలను అయోమయ పరిస్థితిలోకి నెట్టివేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సర్వేల ద్వారా కాలయాపన చేయకుండా, కాంటూరు లెక్కలు చెప్పకుండా వరదల వల్ల నష్టపోయిన ప్రతి నిర్వాసితునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రతి పంచాయితీలో మంచి నీటి సమస్య ఉందని, తాగనీటి ఎద్దడిని నివారించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఈ వేసవిలోనైనా తాగునీటి సమస్య తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, నాయకులు సీసం సురేష్, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, సర్పంచ్ నాగమణి, ఆవుల ఉపేంద్ర, ఆవుల మురళి, కర్నాటి శ్రీనివాసరావు, నానుపల్లి వెంకటేశ్వరావు, మడకం పొద్దయ్య, జోడే రాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

తాగునీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టండి

సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, కరెంటు సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రేకపల్లి సిపిఎం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడేళ్ల నుండి దర్భలంక, సున్నంమట్కా గ్రామంలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే అధికారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటికి స్టిక్కర్లు అతికించటం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరిచాలని కోరారు. పెద్ద మట్టపల్లి నుండి వెంకంపాలెం వరకు రోడ్లు గోతులు పడి ఉన్నాయని, రాత్రి సమయంలో ఆస్పత్రులకు వెళ్లాలన్న నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సున్నంవారి గూడెం, చిన్నమటపల్లి, ములకనపల్లి పంచాయతీల పరిధిలో తాగునీటి పథకాలను పునరుద్ధరించాలని కోరారు. దర్భలంక, సున్నం మట్కా గ్రామాలకు రోడ్డు, కరెంటు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పంకు సత్యనారాయణ, పులి సంతోష్ కుమార్, కె.సత్యనారాయణ, రమేష్, కుంజ నాగిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

108 వాహనంలో జన్మించిన బిడ్డను చూపుతున్న వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి మారేడుమిల్లి

108 అంబులెన్స్‌లో శనివారం ఓ గిరిజన మహిళ ప్రసవించింది. మండలంలోని సున్నంపాడు పంచాయతీ రామన్నపాలెం గ్రామానికి చెందిన గర్భిణి వలల శ్రీలేఖకి శనివారం పురుటి నొప్పులు రావడంతో బంధువులు మారేడుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. అక్కడ నుంచి రంపచోడవరం ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో 108 ఈఎంటీ వెంకట్రావు, పైలెట్ ధనుంజయ్ పురుడు పోశారు. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

ఐదుగురు ఉపాధ్యాయులు అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విద్యార్థినులపై లైంగిక వేధింపుల కేసులో ఐదుగురు ఉపాధ్యాయులను మండలంలోని చెరుకుంపాలెం వద్ద శనివారం అరెస్టు చేసినట్లు స్థానిక సిఐ బాజీలాల్, ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మండలంలోని జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు విచారణ అనంతరం సంబంధిత ఉపాధ్యాయులపై ఫొక్సో కేసుతో పాటు మరో ఎనిమిది సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన ఐదుగురు ఉపాధ్యాయులను శనివారం అడ్డతీగల కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వైసిపి అవినీతిపై విచారణకు వినతి

ప్రజాశక్తి-చింతూరు

చింతూర్ డివిజన్‌లో వైసిపి, నాయకులు, అధికారులు చేసిన రూ.1000 కోట్ల అవినీతిపై విచారణ జరిపించాలని కోరుతూ ఎఎస్‌పికి బిజెపి నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇసుకలో రూ.600 కోట్లు, గంజాయిలో రూ.200 కోట్లు, రోడ్లు, గృహ నిర్మాణ పథకం, జల్ జీవన్ మిషన్, జిసిసి ద్వారా మరో రూ.200 కోట్లు వెరసి రూ.1000 కోట్లు ప్రజా ధనం లూటీ జరిగిందని తెలిపారు. ఈ రూ.1000 కోట్ల అవినీతి స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాయం వెంకయ్య, డివిఎస్.రమణారెడ్డి, ముత్యాల రాంబాబు, కెవి.రమణ సవలం ముత్తమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాతృదినోత్సవంలో కేకు తినిపిస్తున్న కృష్ణకుమారి

ఘనంగా మాతృదినోత్సవం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి, ఆ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు శనివారం కేక్ కట్ చేసి వయోవద్ధులైన తల్లులకు కేకును తినిపించారు. అనంతరం హాజరైన ప్రతి ఒక్కరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ
పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

కళాశాల మైదానంలో జెయింట్ వీల్, వినోద ప్రదర్శనలు

ప్రజాశక్తి-పాడేరు,పాడేరుటౌన్:మోదకొండమ్మ పండగకు అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణం ముస్తాబైంది. రాష్ట్ర గిరిజన జాతరగా పేరొందిన పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, ఆలయ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, కార్యదర్శి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వర్తన పిన్నయ్యదొర, ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి సుబ్బారావు, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. మోదకొండమ్మ ఉత్సవాలు ఈనెల 14, 15, 16 మూడు రోజులపాటు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు మారుమూల గిరిజన గూడెల్లోని ప్రజలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బలగాలను, 1,400 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులూ పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నేడు శతకంపట్టులో మోదకొండమ్మ

ఉత్సవాల్లో తొలి రోజైన ఆదివారం వేకువ జామున మోదకొండమ్మ ఆలయం నుంచి శతకంపట్టు వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రతిష్ఠించడంతో మూడు రోజుల ఉత్సవాలు మొదలవుతాయి. తొలి రోజు అమ్మవారిని శతకంపట్టు వద్ద కొలువు తీర్చే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, బాణాసంచా కాల్పులు, గిరిజన నృత్యాల నడుమ ఈ కార్యక్రమం జరగనుంది. ఆలయ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, పాడేరు సర్పంచి ఉషారాణి తదితరులు ఊరేగింపులో పాల్గొననున్నారు. మూడో రోజు మంగళవారం తిరిగి ఆలయంలో చేర్చడం(అనుకోత్సవం)తో ఉత్సవాలు ముగుస్తాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి పట్టణ వీధుల్లో ఊరేగింపు జరుగుతుంది.

ఉత్సవాల్లో ప్రభుత్వ స్టాళ్లు ఏర్పాటు..

మూడు రోజుల మోదకొండమ్మ ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లతో పాటు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో అవగాహనకు అధికారులు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై సమాచార శాఖ ఆధ్వర్యంలో ఫోటో ప్రదర్శన, జిసిసి, వ్యవసాయ, ఉద్యానవన, కాఫీ, ఐసిడిఎస్, వెలుగు శాఖల కార్యక్రమాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేస్తారు.

మెరిసిపోతున్న పాడేరు

ఉత్సవాల సందర్భంగా పాడేరు పట్టణం విద్యుద్దీపకాంతులతో మెరిసిపోతోంది. సుమారు 40 లక్షలతో పట్టణమంతా సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలు అలంకరించారు. రహదారులన్నీ విద్యుద్దీ పాలంకరణతో కళకళలాడుతున్నాయి. విద్యుద్దీ పాలంకరణలతో చూడముచ్చటగా ఉండేలా లైటింగ్ సెట్టింగులు చేస్తున్నారు. పట్టణంలోని ఆయా చోట్ల ప్రతిమలతో కూడిన లైటింగ్, మెయిన్ రోడ్డుకు, ఆలయానికి వెళ్లే మార్గంలో ఇరువైపులా ఎల్ఇడి బోర్డులు, పట్టణంలోని మెయిన్ రోడ్డు పైన పలు రంగులతో కూడిన సీరియల్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలు రాత్రి సమయంలో ఆకర్షణీయంగా కనిపించేలా లైటింగ్ సెట్టింగులు చేశారు. ఆలయానికి సంప్రదాయంగా ముస్తాబు చేయగా, తొలి రోజు అమ్మవారిని కొలువు తీర్చే సంతకం పట్టు పందిరిని సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయాన్ని, మోదమ్మ మూలవిరాట్ విగ్రహాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, అమ్మవారి ఘటాలను ఊరేగింపునకు సిద్ధం చేశారు.

అమ్మవారిని కొలువుదీర్చే శతకంపట్టు పందిరి

సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ ఉత్సవాలకు విచ్చేసి భక్తులకు వినోదం అందించేందుకు నిర్వాహకులు పట్టణంలోని పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల వస్తువుల విక్రయాలతో పాటు పిల్లల వినోద కార్యక్రమాలతో ఉల్లాసంగా ఉంటుంది. ఈ మూడు రోజులు సినీ, టీవీ కళాకారులతో ప్రదర్శనలు, ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు. మూడో రోజు అణుపు ఉత్సవం రోజున మంగళవారం జరిగే ఊరేగింపు కనువిందుగా నిర్వహించేందుకు వివిధ రకాల వేషధారణలు, నృత్యాలు, ప్రదర్శనలతో పాటు భారీ స్థాయిలో బాణసంచాను కాల్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు

ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల మూడు రోజులపాటు వాహన రద్దీ నియంత్రించేందుకు ట్రాఫిక్‌ను వివిధ మార్గాల్లో మళ్లించారు. పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట నుంచి జి.మాడుగుల, చోడవరం వైపు వెళ్లాల్సిన వాహనాలు అడారిమెట్ట, అడ్డుమండ మీదుగా వంతాడపల్లి చెక్ గేట్ కు చేరుకుని వెళ్లాల్సి ఉంటుంది.

చింతపల్లి, జి.మాడుగుల నుంచి అరకులోయ, చోడవరం వైపునకు వెళ్లాల్సిన వాహనాలు లగిసపల్లి-నక్కలపుట్టు మీదుగా వంతాడపల్లి చెక్ గేట్ కు చేరుకుని వెళ్లాల్సి ఉంటుంది.చోడవరం, వడ్డాది, మాడుగుల నుంచి అరకులోయ, పెదబయలుకు వంతాడపల్లి అడ్డుమండ మీదుగా వెళ్లాలి.

వాహనాల పార్కింగ్

అరకులోయ, ముంచంగిపుట్టు, పెదబయలు నుంచి వచ్చే వాహనాలు కుమ్మరిపుట్టు, తలారిసింగిలో, జి.మాడుగుల నుంచి వచ్చే వాహనాలు సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద నిలపాలి. వి.మాడుగుల, వడ్డాది, చోడవరం నుంచి వచ్చే భక్తుల వాహనాలు ఎంపిడిఓ కార్యాలయం అవతల నిలిపి ఉంచాలి.

మోదకొండమ్మ చరిత్ర ఇదీ..

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో కొలువై నిత్యం పూజలందుకుంటున్న మోదకొండమ్మ ఒడిస్సా రాష్ట్రం నందపురం రాజ్యానికి చెందిన మహారాణి మాకలశక్తి, భైరవుడు దంపతులకు పుట్టిన ఏడుగురు సంతానంలో పెద్ద కుమార్తెగా చెబుతుంటారు. తోడబుట్టిన ఆరుగురు సైతం దేవతామూర్తులుగా వివిధ ప్రాంతాల్లో వెలిశారని చరిత్ర చెబుతుంది. పెద్దక్క మోదకొండమ్మ కాగా, చెల్లెళ్లు.. కోమలమ్మ పాడేరు మండలం వంటలమామిడి వద్ద ఘాట్‌ల, దారాలమ్మ జికె వీధి మండలం దారాలమ్మ ఘాట్‌లో, బోడకొండమ్మ చింతపల్లి ఘాట్‌లో, మావుళ్ళమ్మ వి.మాడుగుల మండలం కొత్తపల్లిలో, కూటి కొండమ్మ వి.మాడుగుల మండలం కింతలి ప్రాంతంలో కొలువయ్యారు. మోదకొండమ్మ పెద్దక్క కావడంతో గిరిజనులు ఈమెకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. ఈ తల్లిని మొక్కుకుంటే కోరిన కోరికలు కచ్చితంగా తీరుతాయనేది వారి నమ్మకం.

పాడేరులో ఆలయ నిర్మాణం

పాడేరుకు 15 కిలోమీటర్ల దూరంలో మోదకొండమ్మ వెలసిన ప్రాంతంలోనే పూర్వం ఓ చిన్న గుడిని నిర్మించారు. పాడేరు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అక్కడికి నడుచుకుంటూ వెళ్లి పూజలు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో మోదకొండమ్మ పేరిట ఉత్సవాలను నిర్వహించేందుకు మోదకొండమ్మ సేవకుడు వెయ్యకుల వెంకటరావు 1970లో శ్రీకారం చుట్టారు. అమ్మవారి పాదాల వద్ద పూజలు నేపథ్యంలో పాడేరులో ఉత్సవం నిర్వహిస్తే బాగుంటుందననే భావనతో సొంత డబ్బులతో ఇక్కడ ఉత్సవాన్ని నిర్వహించారు. 1970 నుంచి 1985 వరకు కొంత మంది సహకారంతో మోదకొండమ్మ ఉత్సవాలు ఆయన నిర్వహించారు. తర్వాత అందరూ కలిసి మోదకొండమ్మ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మవారి పాదాల వద్దకు నడిచి వెళ్లడం ఇబ్బందికరంగా ఉంటుందన్న ఉద్దేశంతో పాడేరులోనే మోదకొండమ్మ ఆలయం నిర్మించాలని 1984లో అప్పటి తహసీల్దార్ జమ్మలమడుగు దాశరధిశర్మ పూనుకున్నారు. స్థానిక పెద్దలతో చర్చించి నిర్ణయించారు. రెవెన్యూ అధికారి లకే ఉమామహేశ్వర పాత్రుడు ఆలయ నిర్మాణానికి స్థలాన్ని దానం చేశారు. అందరి సహకారంతో 1985లో ఆలయ నిర్మాణం, మోదకొండమ్మ విగ్రహ ప్రతిష్ట జరగడంతో అప్పటి నుంచి పాడేరులోనే మోదకొండమ్మ పూజ లందుకుంటుంది. మన్యంతో పాటు, ఉత్తరాంధ్ర ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

ఘనంగా పందిరి రాట

ప్రజాశక్తి-పెదబయలు:మండల కేంద్రంలో మొద కొండమ్మ జాతర ఈనెల 28, 29, 30 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో మొదటి రోజు పందిరి రాటను శతకంపట్టు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ మజ్జి చంద్రుబాబు, గ్రామ పెద్దలు గంపరాయి సూరయ్య, చిన్నయ్య, వర్తక సంఘం అధ్యక్షులు చిన్ని, భాస్కర్‌రావు, బిసి సంఘం అధ్యక్షులు మొగలిపూరి రాధాకృష్ణ పాల్గొన్నారు



దేవతామూర్తుల ప్రతిమలతో లైట్ సెట్టింగులు

నవోదయ పదకొండో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయలో 2023-24 విద్యా సంవత్సరానికి పదకొండో తరగతిలో ప్రవేశానికి మొదటిసారిగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. 2022-23 విద్యాసంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదవతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు 1-6-2006 జూన్ 1 నుంచి 2008 జులై 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. మే 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జులై 22వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష పదవతరగతి స్థాయిలో ఆంగ్లం, గణితం, సైన్సు, సోషల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ విభాగాలలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉంటుందని వివరించారు. ఒఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి వివరాలు పొందవచ్చని పేర్కొన్నారు.

నవోదయలో శత శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -పిఎం పాలెం : సిబిఎస్ఇ బోర్డు ప్రకటించిన పది, పన్నెండో తరగతి ఫలితాలలో కొమ్మాది నవోదయ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. పన్నెండో తరగతిలో 67 మంది విద్యార్థులు హాజరు కాగా 64 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. రొంగలి అలేఖ్య 476 మార్కులతో ప్రథమ స్థానం, 474 మార్కులతో డి.సాయివర్షిత ద్వితీయ స్థానాన్ని పొందినట్టు వివరించారు. పదో తరగతిలో 76 మంది విద్యార్థులు హాజరుకాగా 72 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. బి.పూజిత, బిడి.తేజస్విని 475 మార్కులతో ప్రథమ స్థానాన్ని, నవ్యగీతిక, దివ్యశ్రీలు 473 మార్కులతో ద్వితీయ స్థానాన్ని పొందినట్టు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించినందుకు విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రిన్సిపల్ అభినందించారు.

మాట్లాడుతున్న అప్పలనర్స

గిరిజన సంఘం మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హుకుంపేట:అరకులో జూన్ 8 నుండి 9 వరకు నిర్వహించే గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స పిలుపు నిచ్చారు. హుకుంపేట మండల గిరిజన సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి కిల్లో రామారావు, తాపుల కృష్ణారావుతో కలిసి జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ, గత 3 సంవత్సరాలుగా నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ ఉద్యమానికి ప్రణాళిక రూపొందించుటకు 8వ రాష్ట్ర మహాసభ వేదిక కానుందన్నారు. గిరిజన హక్కులు, చట్టాల అమలుకై రాజీలేని పోరాటాలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సమగ్రాభివృద్ధికి ఉద్యమిస్తున్న 500 మంది గిరిజన ఉద్యమకారులు మహాసభకు ప్రతినిధులుగా హాజరు కానున్నారన్నారు. వేలాది మందితో బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు. మహాసభ నిర్వహణ కోసం గిరిజన, ఉద్యోగ, ప్రజాసంఘాల ప్రతినిధులు, గిరిజన శ్రేయోభిలాషులతో ఏప్రిల్ 1న సంఘం 200 మందితో ఏర్పడిందన్నారు. ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుల ఉద్యమ స్ఫూర్తితో గిరిజన సంఘం ఏర్పడిందన్నారు. రాష్ట్రం నలుమూలల్లో గిరిజనులకు ఎక్కడ ఏ అన్యాయం జరిగినా స్పందిస్తు బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించవద్దని రాష్ట్ర వ్యాప్త ఉద్యమం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఎంపిలను నిలదీస్తూ, చలో కలెక్టర్ కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. పోలవరం, హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో నిర్వాసితులవుతున్న గిరిజనులకు అండగా నిలబడి నిమ్మలపాడు, చింతపల్లి తెల్లరాయి క్వారీ బినామీ, అక్రమ మైనింగ్ రద్దు చేయాలని, అటవీ, పీసా చట్టాలు, 1/70 చట్టం అమలు చేయాలని, విద్యా, వైద్యం, ఉపాధికై నిరంతరం పోరాడుతుందన్నారు. పోరాటాలు, ఉద్యమాలే గాక గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తూ చలికాలంలో గిరిజన ప్రజలకు రగ్గులు పంపిణీ చేసిందన్నారు. కరోనా కష్టకాలంలో లక్షలాది మంది గిరిజనులకు ఉచితంగా మందులు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ఐసోలేషన్ సెంటర్స్ పెట్టి ఆదుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిక్షణం గిరిజనుల పక్షాన ఉంటుందని తెలిపారు. అణువణువునా ఆదివాసీలకు ద్రోహం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నికరంగా పోరాడుతున్న గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభల్లో మరింత లోతుగా చర్చించి గిరిజన హక్కుల రక్షణ, పోరాటాలు, ఉద్యమాలకు దిశానిర్దేశం చేయబోతుందన్నారు. ప్రతి గిరిజన కుటుంబం, గిరిజనులకు అండగా నిలిచే ప్రజాతంత్రవాదులు, మేధావులు, ఉద్యోగులు తమ సంపూర్ణ సహాయ, సహకారాలు అందించి మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శి కిల్లో రామారావు, తాపుల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

772వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 772వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐకి చెందిన సంప్రదాయ మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి కె.లక్ష్మి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని చూడటం దారుణమన్నారు. రెండేళ్లుగా కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటాన్ని చూసైనా మోడీ సర్కారు తన నిర్ణయాన్ని మార్చుకోవాలని అన్నారు. దీక్షల్లో ఎం.లక్ష్మి, సిహెచ్.దుర్గ, ఎర్రయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలా.. మజాకా..!

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు
విశాఖలో 570 మార్కులు పైబడి సాధించిన పలువురు విద్యార్థులు
సత్తా చాటిన భీమిలి స్టూడెంట్స్ - అందరూ పేదింటి పిల్లలే..

ప్రజాశక్తి - భీమునిపట్నం (విశాఖపట్నం)

టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాసిన వారిలో 570 మార్కులు పైబడి సాధించిన వారు 63 మంది ఉన్నారు. ఇదేమీ చిన్న విషయం కాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం వెల్లడించిన విషయం తెలిసిందే. అరకొర సిబ్బందితో ఈ మేరకు ఫలితాలు సాధించడం ఒక విధంగా గొప్ప విషయమనే చెప్పాలి. ఈసారి జిల్లాలో భీమునిపట్నం మండలానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన భీమిలిలోని ఎపి బాలికల గురుకుల పాఠశాల

కేవలం ఇద్దరు సబ్జెక్ట్ టీచర్లు (ఇంగ్లీష్, హిందీ), 14 మంది గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్న ఎపి బాలికల గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. 81 మంది విద్యార్థులకుగాను అందరూ పాసయ్యారు. ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్, ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులు, పిఇటి మాత్రమే పర్మినెంట్ సిబ్బంది. ఇటువంటి పరిస్థితుల్లోనూ పటిష్ట ప్రణాళిక, ఉన్న ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన ఫలితాలు సాధ్యమయ్యాయి. ఇక్కడ చదివేవారంతా పూర్తిగా గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థులే. వారిలో జామి కల్పన 591 మార్కులు, ఎం.తేజశ్రీ 588, ఎస్.సౌజన్య, కె.నిహారిక, కె.సాయి 586 మార్కులు చొప్పున సాధించారు. 575 మార్కులు పైబడి 9 మంది, 570 పైబడి 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తెలుగు సబ్జెక్ట్‌లో నూటికి నూరు మార్కులు 30 మంది సాధించగా, గణితంలో 12 మంది, సోషల్‌లో ఆరుగురు, సైన్స్‌లో ఒకరు నూటికి నూరు శాతం మార్కులు పొందారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులంతా మట్టిలో మాణిక్యాలే. పుట్టి పెరిగింది గ్రామీణ ప్రాంతం. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వారే అధికం. ఓ వైపు పేదరికం, మరో వైపు పుట్టెడు కష్టాలు.. వీటికి తోడు ఉపాధ్యాయుల కొరత, ఇన్ని సమస్యలున్నా వారు సత్తా చాటారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇలా..

చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్‌పి హైస్కూల్‌లో కూడా టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. ఇదే పాఠశాల నుంచి 126 మంది విద్యార్థులకుగాను 104 మంది అత్యుత్తమ ఫలితాలు సాధించారు. బోర త్రిలోక్ 585 మార్కులు, కెవివి కార్తీక్ 579 మార్కులు సాధించగా, 15 మంది 500కి పైబడి మార్కులు సాధించారు. భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్‌పి హై స్కూల్‌లో 88 మందికిగాను 69 మంది ఉత్తీర్ణత సాధించారు. కాళ్ళ జ్ఞానేశ్వరి 582 మార్కులు, బోని కావ్య 571 మార్కులు సాధించారు.

మరికొన్ని పాఠశాలల్లో..

ఎంజెపిఎపి, బిసి, సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించారు. సిహెచ్.భవిత 583, కె.హారిక 581, బి.వనిత 579 మార్కులు సాధించారు. కెజిబివిలో కె.జాహ్నవి 575 మార్కులు సాధించింది. స్థానిక కెజిబివిలో 100 శాతం ఉత్తీర్ణతా శాతం నమోదైంది. 36 మందికిగాను 36 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ ఏడుగురు సబ్జెక్ట్ టీచర్లు ఉండగా వీరంతా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు

సమిష్టి కృషితోనే ఫలితాలు

సమిష్టి కృషితోనే మా పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించగలిగారు. ఎపి యాప్ (ఆల్‌పాస్, యాక్షన్ ప్లాన్) ప్రకారం విద్యార్థులకు తరచూ వివిధ పరీక్షలు నిర్వహించాం. 45 రోజుల యాక్షన్ ప్లాన్ ముందుంచుకుని ఆ దిశగా ప్రణాళిక ప్రకారం విద్యార్థినులకు సిలబస్ పూర్తి చేశాం. వెనుకబడిన విద్యార్థినులను దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించాం. డిసెంబర్ నాటికే సిలబస్ పూర్తి చేశాం. సాధారణ పరీక్షలకు ముందే ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాం. దీంతో మంచి ఫలితాలు వచ్చాయి.

కోడి రాంబాబు, ప్రిన్సిపాల్,
ఎపి బాలికల గురుకుల పాఠశాల, భీమునిపట్నం

స్టడీ అవర్స్ ఉపయోగపడ్డాయి

రోజులో 4 గంటలపాటు నిర్వహించిన స్టడీ అవర్స్ బాగా ఉపయోగ పడ్డాయి. సబ్జెక్ట్ టీచర్లు బాగా పాఠాలు చెప్పారు. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేశారు.

జామి కల్పన (591 మార్కులు),
ఎపి బాలికల గురుకుల పాఠశాల, భీమునిపట్నం

అందరి ప్రోత్సాహంతోనే మంచి మార్కులు

ఏ సబ్జెక్ట్‌లో ఏది అవసరమో అదే అంశాన్ని ఉపాధ్యాయులు చెప్పేవారు. ఉపాధ్యాయుల సూచనల మేరకు చదివాను. అందరి ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు సాధించాను.

బోర త్రిలోక్ (585), జెడ్‌పి హైస్కూల్, చిట్టివలస

ఘనంగా ప్లేట్ టేబుల్ టెన్నిస్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, ప్లే ఫిట్ టీం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్లేట్ టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్ - 2023 పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఈశ్వర్ షిప్పింగ్ చైర్మన్ బి.హనుమంతరావు, ఒడిశా స్టీవ్‌డోర్స్ వైస్ ప్రెసిడెంట్ జెకె.నాయక్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ప్రధాన కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ కెవి.మురళీమోహన్ పాత్రో, ఎస్ఎంఎస్ డెంటల్ ఛైర్మన్ డాక్టర్ బి.శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐదు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొననున్నారు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు శైలు నూరుబాషా, విజి.సంయుక్తలతో పాటు పలువురు క్రీడాకారులు ఈ పోటీలకు రానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

బ్రిజ్ భూషణ్ సింగ్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహిళా రెజ్లర్ల పోరాటానికి ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఢిల్లీలో జరుగుతున్న మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా ఎపి మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ దిష్టిబొమ్మను శనివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ జంక్షన్‌లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.విమల మాట్లాడుతూ భారత దేశానికి అంతర్జాతీయ వేదికపై పతకాలు సాధించిపెట్టిన మహిళా రెజ్లర్లపై ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ప్రధానికి, క్రీడా రంగ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో వారంతా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొన్నిరోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారని తెలిపారు. వారికి న్యాయం చేయాల్సిందిపోయి ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నేతలు మహిళలపై లైగింక దాడులకు, హత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఎఐఎస్ఎఫ్ నాయకులు యు.నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎ.భేగం, జయ, వనజాక్షిలతోపాటు మధు, సందీప్, రమణ, శివ, ఈశ్వర్ పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధుల సమస్యలు పరిష్కరించాలి

- ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - అనకాపల్లి : స్థానిక ప్రజాప్రతినిధుల సమస్యలను పరిష్కరించాలని, సర్పంచులకు, ఎంపిటిసిలకు రూ.15 వేలు, ఎంపిపిలకు, జెడ్‌పిటిసిలకు రూ.30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలో శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచుల సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన సర్పంచుల నిధులు రూ.8 వేలా 660 కోట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని కోరారు. గ్రామానికి సేవ చేద్దామని ఎన్నో ఆశలతో, ఆశయాలతో రెండు సంవత్సరాల క్రితం ఎన్నికై వచ్చిన సర్పంచులు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా సర్పంచులకు రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలను ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా దారి మళ్లించడం దారుణమన్నారు. ఆ నిధులను తన సొంత అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకోవడంతో గ్రామాలు నిర్వీర్యమైపోతున్నాయని మండిపడ్డారు. కొత్తగా కేంద్రం నుంచి రావాల్సిన రూ.2 వేలా 20 కోట్లు రాష్ట్రానికి వచ్చాయా ? ఒకవేళ వస్తే గతంలో రూ.8660 కోట్లను దారి మళ్లించినట్టే ఈ డబ్బులను కూడా దారి మళ్లించి సొంత అవసరాలకు వాడుకున్నారా ? అన్న విషయాన్ని చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

అయ్యన్ ప్రణతికి అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఐడిల్ సీజన్ - 2లో విశాఖ గాయని బేబీ అయ్యన్ ప్రణతి ఫైనల్స్ విజేత కావాలని మెగాస్టార్ చిరంజీవి ఆకాంక్షించారు. ఆహా ఒటిటి తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్-2లో వైజాగ్ శివాజీపాలెంలోని డాక్టర్స్ కాలనీకి చెందిన అయ్యన్ ప్రణతి టాప్ 6లో కొనసాగుతూ విజయం వైపు దూసుకెళ్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి అయ్యన్ ప్రణతిని స్వయంగా అభినందించారు. ఆమెను కుటుంబ సమేతంగా చిరంజీవి తన నివాసానికి ఆహ్వానించి ఆమె మధురగానాన్ని కుటుంబీకులతో సహా ఆస్వాదించారు. అనంతరం ఆమెను ప్రశంసిస్తూ సత్కరించారు.